
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 2 జూలై 2024

మహిళా వర్సిటీ వీసీ భారతి రాజీనామా



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1: తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వీసీ దేపూరు భారతి తన పదవికి రాజీనామా చేశారు.ఇందుకు సంబంధించిన లేఖను ఆమె మెయిల్ ద్వారా గవర్నర్‌తో పాటు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికీ పంపారు. 2023 జూన్ 15వ తేదీన వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆమె ఇటీవలే ఏడాది పాలనా కాలాన్ని పూర్తి చేసుకున్నారు.వీసీ బంగ్లాను ఆదివారమే ఖాళీ చేశారు.



చిట్టమూరులోని కొత్తగుంట వద్ద పింఛన్ డబ్బులతో సీఎం చంద్రబాబు కటౌట్ వద్ద కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళ

కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జిల్లా అంతా పండుగలా సాగింది. ఉదయం ఆరింటికే అవ్వాతాతల వాకిట్లో సచివాలయ సిబ్బంది వాలిపోయారు. ఒకేసారి ఏడువేలు అందుకున్న కళ్లు ఆనందంతో మెరిసాయి. ఆరువేలు అందుకున్న దివ్యాంగులు, పదివేలు, పదిహేను వేలు వంతున అందుకున్న దీర్ఘవ్యాధులున్నవారు కన్నీటితో చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభ్యులు, కూటమి పార్టీల నాయకులు పింఛను అందించి, ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఒకే రోజు జిల్లాలో 95.67 శాతం మందికి ఇంటివద్దనే పింఛన్లు అందించి సచివాలయ సిబ్బంది శభాష్ అనిపించుకున్నారు. దీంతో ఎన్నికల కోడ్ వేళ పింఛన్లు అందకుండా చంద్రబాబు కుట్ర చేశారంటూ జగన్ చేసిన ప్రచారం అబద్ధమని తేలిపోయింది. వలంటీర్లు లేకుండా పంపిణీ అసాధ్యమన్న వాదనా వీగిపోయింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పింఛన్ల పండుగ

ఒకే రోజు ఇళ్లవద్దే పెంచిన మొత్తం అందుకున్న అవ్వాతాతల ఆనందం

ఉబ్బితబ్బిబ్బైన సరస్వతమ్మ



డక్కిలి మండలం మోపూరుకు చెందిన నీలం సుబ్బారావు వృద్ధాప్యంలో అనారోగ్యంతో మంచంపై నుంచీ లేవలేని స్థితిలో వున్నారు. భార్య సరస్వతమ్మ ఆయన ఆలనాపాలనా చూసుకుంటున్నారు. సోమవారం ఉదయాన్నే తలుపు తట్టిన చప్పుడు వినిపిస్తే వెళ్ళి చూసేసరికి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గుమ్మంలో కనిపించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు వున్నారు. ఇంట్లోకి వెళ్లిన ఎమ్మెల్యే సరస్వతమ్మను పలకరించి ఆమె భర్త ఆరోగ్యం ఎలా వుందంటూ వాకబు చేశారు. తమ ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని రూ. 3 వేల నుంచీ రూ. 4 వేలకు పెంచిందని, నాలుగు నెలల పెండింగ్ నగదుతో కలిపి మొత్తం రూ. 7 వేలు ఆమె చేతికందించారు. స్వయంగా ఎమ్మెల్యే ఇంటికొచ్చి పెంచిన పెన్షన్ మొత్తాన్ని ఇవ్వడంతో సరస్వతమ్మ సంతోషంతో ఉబ్బితబ్బిబ్బైంది. ఆమె ముఖంలో సంతోషం చూసిన ఎమ్మెల్యే ఇలాంటి పనులతోనే ఆత్మ సంతృప్తి వస్తుందంటూ వ్యాఖ్యానించారు.

పింఛన్ల పంపిణీ
95.67 శాతం
2,57,500మందికి
రూ.174.5కోట్ల అందజేత
తిరుపతి జిల్లాకు
రాష్ట్రంలో 7వ స్థానం

మనోవ్యథ తీర్చిన చంద్రబాబు



ఇంటి పెద్దగా కుటుంబాన్ని పోషించాల్సిన నేను కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ కోసం ఇంట్లో వారికే భారంగా మారానని బాధపడని రోజు లేదు... ప్రభుత్వం రూ. 5 వేలు పెన్షన్ ఇస్తే మిగిలింది ఇంట్లో వాళ్ళు భరిస్తున్నారు. ఇపుడు చంద్రబాబు ప్రభుత్వం రూ. 5 వేల పెన్షన్ రూ. 15 వేలకు పెంచింది. ఈరోజే పెంచిన పెన్షన్ చేతికొచ్చింది. ఈ నెల నుంచీ ఇంట్లో వాళ్ళను కష్టపెట్టకుండా ఆ డబ్బుతో డయాలసిస్ చేయించుకుంటా. ఇంటికి బరువయ్యానే అన్న మనోవ్యథ లేకుండా చేసిన చంద్రబాబుకు చేతులెత్తి మొక్కుతున్నా....

- కిడ్నీ బాధితుడు తాళ్ళ మార్కండేయులు, ఉపాధ్యాయ కాలనీ, వెంకటగిరి

నారాయణమ్మ నవ్వింది!



చిల్లకూరు దళితవాడకు చెందిన నారాయణమ్మ పక్షవాతంతో బాధపడుతోంది. మాట్లాడలేదు. చేతులు సైతం సక్రమంగా కదిలించే పరిస్థితి లేదు. మొన్నటి దాకా గత ప్రభుత్వంలో నెలవారీ రూ. 5 వేలు పెన్షన్ అందేది. ఆ డబ్బు నెలకంతా మందులకే సరిపోయేది కాదు.సోమవారం పెంచిన పెన్షన్ మొత్తం రూ. 15 వేలు సచివాలయ ఉద్యోగి, టీడీపీ నాయకులు ఇంటికి వెళ్ళి ఆమెకు అందజేశారు. పక్షవాతం కారణంగా మాట్లాడలేని స్థితిలో వున్నప్పటికీ అంత డబ్బు చేతిలో పెట్టేసరికి ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోయింది. నవ్వు ముఖంతో చల్లగా వుండండంటూ చేతిని కదిలించి దీవించే ప్రయత్నం చేసింది.

ఎల్లమ్మ ఆనందం

తిరుపతి 43వ డివిజన్‌లోని యశోదనగర్‌లో ఓ చిన్న అద్దెగదిలో ఎల్లమ్మ (70) ప్రభుత్వం ఇచ్చే నెలవారీ పింఛన్, రేషన్‌తో జీవిస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం పెంచిన పింఛన్ సోమవారం ఇస్తారని తెలుసుకుని ఉదయాన్నే నిద్రలేచింది. ఇంటిముందుకు రాగానే అప్పటికే సచివాలయ సిబ్బందితో పాటు చేరుకున్న కూటమి పార్టీల శ్రేణులు ఆప్యాయంగా పలకరించారు. 'ఇదిగో ఎల్లవ్వా....చంద్రబాబు పింఛన్ పంపించారు' అంటూ ఆమె చేతికి అందించారు.గత నెల వరకూ రూ.3వేల పింఛన్ తీసుకుంటున్న చేతికి రూ.7వేలు రాగానే ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.



పెంచిన పెన్షన్‌తో బతికిపోతాం



ఈ ఫొటోలో నులక మంచంపై వున్న అద్దూరి సూరమ్మకు 85 ఏళ్ళు. ఓజిలి మండలం కొత్తపేటకు చెందిన నిరుపేద గిరిజన కుటుంబం. కళ్ళు కనపడవు. లేవలేని స్థితిలో వుంది. వెనుక నిలుచున్నది ఆమె కూతురు బంగారమ్మ వయసు 62. వితంతువు. పిల్లలు లేరు. ఒంటరైన బంగారమ్మ ఒంటరిగా వున్న తల్లి వద్ద చేరి ఆలనాపాలనా చూసుకుంటోంది. ఇరువురికీ పెన్షన్ వస్తుంది. ఇప్పటిదాకా ఇద్దరికీ చెరి రూ. 3 వేల చొప్పున నెలకు రూ. 6 వేలు వచ్చేది. ఇక నుంచీ పెంచిన మొత్తం ఇద్దరికీ చెరి రూ. 4 వేల చొప్పున నెలనెలా రూ. 8 వేలు అందనుంది. కాగా సోమవారం గత నాలుగు నెలల పెంచిన మొత్తంతో కలిపి ఇద్దరికీ రూ. 14 వేలు అందడంతో వారి సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. పెంచిన పెన్షన్ రూ. 8 వేలు తమకు సరిపోతుందని దానితోనే బతికేస్తామంటూ కూతురు బంగారమ్మ సంబరంగా చెప్పింది.

వలంటీర్లు లేకున్నా సజావుగా పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1 : ఎన్నికలకు ముందు పింఛన్ల పంపిణీకి వలంటీర్లను ఈసీ దూరంగా పెట్టడంతో సమయానికి సొమ్మందక అవ్వాతాతలు ఆందోళన చెందారు.సచివాలయ సిబ్బంది చేత పంపిణీ చేయిస్తే ఇబ్బందులుండవన్న విపక్షాల సూచనలనూ పాలకులు పట్టించుకోకపోవడంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో బ్యాంకుల చుట్టూ, పోస్టాఫీసుల చుట్టూ ఎండన బడి తిరగలేక వృద్ధులు అల్లాడిపోయారు. ప్రతిపక్షాలకు పెన్షనర్లను వ్యతిరేకం చేయాలనే జగన్ కుట్రకు అధికారులు వత్తాసు పలికారు.వలంటీర్లు లేకపోతే సకాలంలో పెన్షన్లు పంపిణీ చేయడం సాధ్యం కాదని వాదించారు.అయితే పరిపాలకులు సమర్థులైతే ఏదైనా సాధ్యమే అన్నదానికి జిల్లావ్యాప్తంగా సోమవారం పంపిణీ అయిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లే ఉదాహరణ. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 11,714మంది వలంటీర్లు పని చేసేవారు. పెన్షన్లు పంపిణీ చేయడానికి మూడు, నాలుగు రోజులు పట్టేది. అయితే ఈ నెల వలంటీర్లు లేకున్నా ఒక్కోరోజులోనే 95.67శాతం పింఛన్లను సచివాలయ సిబ్బందిచేత పంపిణీ చేయించి ప్రభుత్వం శభాష్ అనిపించుకుంది. జిల్లాలోని 691 గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న 5,827మంది సిబ్బందికి 50మంది లెక్కన పెన్షనర్లను కేటాయించి సోమవారం ఉదయం 6గంటల నుంచే పెన్షన్ల పంపిణీని ప్రారంభించింది. పించనుదారుల ఇళ్లకు వెళ్లి చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మూడు నెలల అరియర్స్‌తో పాటు రూ.7వేల పింఛను మొత్తాన్ని పంపిణీ చేశారు. 2,69,162మంది పింఛనుదార్లకు గాను మొదటి రోజే 2,57,500 మందికి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయడం గమనార్హం. మొదటి రోజే సుమారు రూ.174.5కోట్ల నగదు పింఛనుదారులకు అందింది.మిగిలిన 4శాతం మందిలో కూడా కొంత మంది మరణించడం,మరికొంతమంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారేనని జిల్లా యంత్రాంగం తెలిపింది. రాష్ట్రంలోనే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో 95.67 శాతంతో జిల్లా 7వ స్థానంలో నిలిచింది.వలంటీర్లు లేకున్నా సచివాలయ సిబ్బందితోనే పింఛన్లను పంపిణీ చేయవచ్చని నాడు అన్న చంద్రబాబు మాటలు అక్షరాలా నిజమయ్యాయి.

గ్రీవెన్స్ డేకి తగ్గిన జనం

ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను అందుకునేందుకు ఎక్కువమంది ఇండ్ల వద్దే వుండిపోవడంతో కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు తగ్గారు. ప్రతి వారం 150దాకా ఫిర్యాదులందేవి. ఈ వారం 49మంది మాత్రమే సమస్యలను అర్జీరూపంలో అందజేశారు.



పింఛన్ల పంపిణీలో సర్పంచ్

నాగలాపురం, జూలై 1: నాగలాపురం మండలం సురుటుపల్లె పంచాయతీలోని కస్తూరి నాయుడు కండ్రిగ గ్రామంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.వైసీపీ నాయకురాలు, సర్పంచ్ కాంతమ్మను టీడీపీ నాయకులు ఆహ్వానించి ఆమె చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేయించడం చర్చనీయాంశమైంది.

టీడీపీ కండువాతో సర్పంచ్ పింఛన్ల పంపిణీ

కువ్వాకొల్లి పంచాయతీలో ఉద్రిక్తత

వరదయ్యపాళెం, జూలై 1 : టీడీపీ కండువాలతో వైసీపీ నాయకుడు పింఛన్లు పంపిణీ చేసిన ఘటన సోమవారం వరదయ్యపాళెం మండలంలో చోటు చేసుకుంది. కువ్వాకొల్లి పంచాయతీలో మాజీ సర్పంచ్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, నాయకులు ఉండగా వైసీపీ నాయకుడు, సర్పంచ్ చంద్రయ్య టీడీపీ కండువా కప్పుకుని పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి నిర్మల్, మరదవాడ సర్పంచ్ కుమారుడు కుమార్ అక్కడికి చేరుకుని సర్దుబాటు చేయడంతో ఆయన అక్కడినుంచి వెళ్లిపోయారు.



ఎన్నికల ఖర్చు వివరాలను 4లోపు సమర్పించాలి

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు సూచన

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ లోపు ఖర్చుల వివరాలను సమర్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర తెలిపారు.లేకుంటే అనర్హత వేటు పడటంతోపాటు తదుపరి ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కోల్పోతారన్నారు. జిల్లాలో 156మంది అభ్యర్థులు పోటీ చేశారని వీలైనంత త్వరగా ఖర్చుల వివరాలను సూచించిన ప్రొఫార్మాలో పొందుపరిచి ఇవ్వాలని సూచించారు.

విజిలెన్సు ఏఎస్పీ ఈశ్వర రెడ్డి బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 1: తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు అదనపు ఎస్పీగా పనిచేస్తున్న ఈశ్వరరెడ్డిని బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన్ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలన్నారు. ఈశ్వర రెడ్డి స్థానంలో విజయవాడలో విజిలెన్సు ఎస్పీగా పనిచేస్తున్న కరీముల్లా షరీఫ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

కొత్త చట్టాలతో పెరిగిన పారదర్శకత, జవాబుదారీతనం

ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలతో పోలీసు దర్యాప్తులో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగిందని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు.'గతంలో ఉన్న ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాలను ప్రభుత్వం రద్దు చేసి.. కొత్త చట్టాలను తెరపైకి తెచ్చింది. ప్రధానంగా మహిళలు, చిన్నపిల్లలకు సంబంధించిన కొన్ని చట్టాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త చట్టాలు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు హామీ ఇస్తున్నాయి. గతంలో ఉన్న జీరో ఎఫ్ఐఆర్‌తోపాటు ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఎఫ్ఐఆర్‌ను ప్రవేశ పెట్టారు. 18 ఏళ్లలోపు బాలికలపై సామూహిక అత్యాచారానికి పాల్పడితే జీవిత ఖైదు లేదా మరణ శిక్ష విధించేలా మార్పులు తీసుకొచ్చారు. ఎక్కడైనా అత్యాచారాలు, హత్యలు, హత్యాయత్నాలు, చోరీలు, దోపిడీలు తదితర ఘటనలు జరిగినప్పుడు పోలీసులు కచ్చితంగా ప్రతి ఆధారాలను వీడియోతీసి.. స్పష్టంగా కోర్టుకు సమర్పించాలి. కొన్ని నేరాల్లో కమ్యూనిటీ సేవలు పెంచడం జరిగింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023 మేరకు గతంలో ఉన్న సీఆర్‌పీసీలోని 484 చట్టాలను 531కి పెంచారు. కొత్త క్రిమినల్ చట్టాల్లో స్త్రీలు, పిల్లలపై నేరాలను సూచించే 37 విభాగాలను కలిగి ఉన్నాయి. మూడేళ్ల కంటే తక్కువ జైలు శిక్ష విధించదగిన నేరం విషయంలో డీఎస్పీ స్థాయి అధికారి కంటే తక్కువ లేని అధికారి ముందస్తు అనుమతి లేకుండా అరెస్టు చేయకూడదు' అని ఎస్పీ వివరించారు.ఏఎస్పీలు వెంకట్రావు, విమల కుమారి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఒకటో తారీఖే జీతం

ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆనందం

ఒకటో తేదీనే జీతాలు. ఇది ఒకప్పుడు కామన్. ఇప్పుడు ఆశ్చర్యం. ఎందుకంటే.. జగన్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు పడిన దాఖలాల్లేవు. అసలు ఏ తేదీన జీతాలు వస్తాయో తెలియని పరిస్థితి. అలాంటిది కూటమి ప్రభుత్వం ఒకటో తేదీన జీతం జమ చేసింది. దీంతో తొలిరోజే జీతం చూసుకుని ఎన్నేళ్లయిందోనని ఉద్యోగులు ఆనందం వ్యక్తంచేశారు. ఇది కలా.. నిజమా అన్నట్లుగా చర్చించుకున్నారు. చిత్తూరు జిల్లాలో 98 ప్రధాన ప్రభుత్వ శాఖల్లో 25,748 మంది ఉద్యోగులకు జూన్ నెల జీతాలకింద సుమారు రూ.135 కోట్లు అందజేయాల్సి ఉంది. ఒకటో తేదైన సోమవారం రాత్రి వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. సోమవారం రాత్రికే పూర్తికావచ్చని అధికారులు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతినెలా ఒకటో తేది రెవెన్యూ, జ్యుడిషియల్, ఖజానా, మెడికల్, పోలీసు, సచివాలయ తదితర పది శాఖల్లోపు ఉద్యోగులకే జీతాలు పడేవి. మిగిలిన వారికి విడతల వారీగా 15వ తేదీ వరకు జమయ్యేవి. దీంతో సకాలంలో ఈఎంఐలు కట్టలేక.. పలువురు డిఫాల్టర్లు అయ్యారు. అందుకని కొందరు అధిక వడ్డీలకు అప్పు చేయాల్సి వచ్చింది. గతంలో పీఆర్సీ, డీఏల కోసం ఎదురుచూసిన ప్రభుత్వ ఉద్యోగులు.. గత ఐదేళ్లలో జీతాలిస్తే చాలు అన్నట్లుగా మారారు. అలాంటి వీరికి ఒకటో తేదీన జీతం పడేసరికి ఆనందం వ్యక్తంచేశారు.

విశ్రాంత ఉద్యోగులకూ..: చిత్తూరు జిల్లాలోని 12,505 మంది ప్రభుత్వ పెన్షనర్లకు సైతం రూ.62.52 కోట్లు సోమవారం రాత్రి వరకు జమవుతూ ఉండటంతో వారి మోముల్లో ఆనందం కనిపించింది. వారికి కూడా ప్రతినెలా 10 లేదా 15వ తేదీ తర్వాతే పెన్షన్ డబ్బులు పడేవి. మందుల కొనుగోళ్లకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వీరికీ పెన్షన్ల జమ సోమవారం రాత్రికంతా పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

- చిత్తూరు కలెక్టరేట్

చంద్రబాబు చల్లగా ఉండాల



రూ.7 వేలు డబ్బిచ్చిన చంద్రబాబు చల్లగా ఉండాల. మాలాంటి వాళ్లను అందుకునేలా పింఛను పెంచడం చాలా సంతోషంగా ఉండాది. మా బిడ్డలు, మనవళ్లపై ఆధారపడకుండా పింఛను తీస్కోవడం ఆనందంగా ఉండాది. ఈప్రభుత్వానికి మాలాంటి పెద్దోళ్లతో పాటు పెద్దాయన యంకటేశరస్వామి ఆశీర్వాదాలు కూడా బాగుండాలని కోరుకుండాండ.

- సులోచన భాయ్, తిరుమల స్థానికురాలు

నా కుమారుడి చికిత్సకు భరోసా

గతనెల వరకు మా కుమారుడు చిన్నికృష్ణకు చికిత్స, మందుల కోసం ప్రతినెలా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది. నెలకు రూ.5వేలు మాత్రమే పింఛన్ వచ్చేది. అదనంగా మరో రూ.10వేలు అప్పు చేసి వైద్యం అందించాల్సిన పరిస్థితి. ఈ ప్రభుత్వంలో పింఛన్ రూ.15వేలకు పెరగడం మా కుటుంబానికి భరోసా ఇస్తుంది. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి, సీఎంకి రుణపడి ఉంటాము.

- చిన్నికృష్ణ తల్లి దేవిక, పుదిపట్ల పంచాయతీ అరుంధతీ పురం, తిరుపతి రూరల్ మండలం

వైద్యఖర్చులకు కొండంత అండ

కూటమిపార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీఎం చంద్రబాబు రూ.15వేలు పింఛన్ అందించి మా కుంటుంబానికి కొండంత అండగా నిలచారు. మాలాంటి వారికి పెరిగిన పింఛన్ ఎంతోగానో ఉపయోగపడుతుంది. మాటిచ్చి నిలబెట్టుకున్న సీఎంగా చంద్రబాబు చరిత్రలో నిలచిపోతారు.

- నితిన్ తల్లిదండ్రులు లక్ష్మి, శ్రీనివాసులు, తుమ్మలగుంట, తిరుపతి రూరల్ మండలం

చంద్రబాబుకు రుణపడి ఉంటాం



పుట్టుకతోనే నాబిడ్డ అవిటిది. బిడ్డను ఒంటరిగా వదిలిపెట్టి పనికి కూడా పోలేకపోయే దాన్ని. పాపకొచ్చే ఐదు వేల పింఛన్ మందులకే సరిపోయేది కాదు. చంద్రబాబు పుణ్యమా అని ఇప్పుడు రూ.15వేలు వచ్చింది. దీంతో బిడ్డను మరింత బాగా చూసుకునేందుకు అవకాశం వచ్చింది. చంద్రబాబుకు మా కుటుంబమంతా రుణపడి ఉంటాం.

- కె.పుష్ప (దివ్యాంగురాలు కె.జ్యోతిష తల్లి), గెరికచేనుపల్లె, రామచంద్రాపురం మండలం

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

చంద్రగిరి, జూలై 1: ముఖ్యమంత్రి చంద్రబాబు మాట తప్పడు, మడమ తిప్పడు అనడానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమమే నిదర్శనమని



చంద్రగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. సోమవారం చంద్రగిరిలోని అక్కగార్ల కాలనీ, ఎ.రంగంపేటలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బుచ్చినాయుడుపల్లెలో సర్పంచ్ రవి నాయుడు, మాజీ సర్పంచ్ వేణు, మిట్టపాలెం పంచాయతీలో టీడీపీ నాయకుడు చిరంజీవి, రెడ్డివారిపల్లె పంచాయతీలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శివకోటేశ్వరరెడ్డి, కొటాల పంచాయతీలో తెలుగు మహిళ కార్యదర్శి సింగు సుధా ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ఇంటింటికి సచివాలయ సిబ్బందితో వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో వెంకట సూర్యసాయి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు సురేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, బాలకృష్ణ మూర్తి, లోకాద్రి, కొండూరు ప్రవీణ్, గౌస్‌బాషా, తులసేశ్వరరెడ్డి, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో...

పాకాల, జూలై 1: మండలంలోని వల్లివేడులో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిణీ చేశారు. మండలంలో 8,820 పింఛన్లకు గాను 8077 మందికి ఒక్క రోజులో పంపిణీ చేశారు. వల్లివేడు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కొమ్మెపల్లెలో బోరును ప్రారంభించారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఎంపీడీవో నాగేంద్ర బాబు, తహశీల్దార్ వాణిశ్రీ, ఈవోఆర్డీ మాలతి, టీడీపీ సీనియర్ నాయకుడు వలపల దశరథ నాయుడు, మండల కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, ఎంపీటీసీ విజయసింహారెడ్డి, నాయకులు శివారెడ్డి, సతీష్‌రెడ్డి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వల్లివేడులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

అత్యున్నత ప్రమాణాలతో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

అధికారులతో టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యున్నత ప్రమాణాలతో పారిశుధ్య చర్యలు చేపట్టాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో సోమవారం టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, హెల్త్ విభాగం అధికారులతో ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తుల క్యూలు విస్తరించిన ప్రాంతంలో తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో పారిశుధ్య పనితీరులో లోపం, సమయానికి శానిటరీ మెటీరియల్స్‌ను ఏజెన్సీలు సరిగ్గా సరఫరా చేయకపోవడం, నాణ్యతలేని క్లీనింగ్ సామాన్లను సరఫరా చేయడం తదితర అంశాలపై ఈవో అధికారులతో చర్చించారు. ఈవో మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లను కఠినంగా హెచ్చరించాలని, నిబంధనల ప్రకారం సరిపడా సిబ్బంది, మెటీరియల్ సరఫరా చేసి తిరుమలలో పరిశుభ్రత చర్యలు మెరుగుపరిచేందుకు మూడురోజుల సమయం ఇవ్వాలని జేఈవోలను ఆదేశించారు. మూడురోజుల తర్వాత ఆకస్మిక తనిఖీలు చేసేందుకు సీనియర్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి, తదుపరి చర్యలు తీసుకోవడానికి పారిశుధ్యంపై సవివరమైన నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమీక్షలో ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో హరికృష్ణ, హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి, ఈఈ ఎఫ్ఎంఎస్ శ్రీనివాసరావు, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

కొవిడ్ సమయంలో తగ్గించిన ప్రసాద దిట్టాన్ని పెంచండి

శ్రీవారి ఆలయానికి సంబంధించిన పలు ఆచార వ్యవహారాలు, వైఖానస ఆగమోపచారాలు, పలు అంశాలపై ఆలయ అర్చకులు, ఆగమ పండితులతో టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం సమీక్షించారు. తిరుమలలో వైఖానస ఆగమం ప్రకారం జరుగుతున్న వివిధ ఆచారాలు, కైంకర్యాల గురించి ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు ఈవోకు వివరించారు. గతంలో ప్రతి సోమవారం ఆర్జితసేవగా నిర్వహించే విశేష సేవను కనీసం ఏడాదిలో ఒక్కసారైనా నిర్వహించాలని కోరారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి చెందిన శ్రీనివాస దీక్షితులు మాట్లాడుతూ.. కొవిడ్ సమయంలో తగ్గించిన ప్రసాద దిట్టం ఇంకా కొనసాగుతైనే ఉందని, దానిని పెంచాలని ఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఆగమ సలహాదారులు ఆలయ ప్రతిష్టకు భంగం కలగకుండా పురాతన సంప్రదాయాలు పరిరక్షించడంలో, ఆచారాలకు విఘాతం కలుగకుండా చూసుకోవడంలో తమ పాత్రను ఈవోకు తెలిపారు. అనంతరం శ్రీవారి అన్నప్రసాదాలపై ఆలయ, పోటు అధికారులతో కూడా ఈవో సమీక్షించారు. ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, రామకృష్ణదీక్షితులు, డిప్యూటీఈవో లోకనాథం, పోటు పేష్కార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి పలువురి శుభాకాంక్షలు



సుబ్రమణ్యం నాయుడును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు అనిల్‌చౌదరి, నాయకులు

చంద్రగిరి, జూలై 1: చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అత్తూరు తులసేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరై కేక్ కట్ చేసి, సుబ్రహ్మణ్యం నాయుడుకి తినిపించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరదరరావు, నాయకులు సురేష్‌రెడ్డి, సింగు సుధా, రమేష్‌రెడ్డి, గౌస్ బాషా, బాలకృష్ణమూర్తి, లోకాద్రి,కొండూరు ప్రవీణ్, తులసేశ్వరరెడ్డి, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, సునీల్, రామారావు, అనిల్‌చౌదరి, మునిరత్నంరాయల్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు

తిరుమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 81,005 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,244 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



గాలి భానుప్రకాష్, పక్కన నటుడు తిరువీర్ - దమ్మలపాటి శ్రీనివాస్

తిరుమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, సినీ నటుడు తిరువీర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుచానూరులో పింఛన్ల పంపిణీ

తిరుచానూరు, జూలై 1: తిరుచానూరు నవజీవన్ సమక్షంలో వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు ఎమ్మెల్యే పులివర్తి నానీ సతీమణి సుధారెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. తిరుచానూరు పంచాయతీ కార్యాలయంలో టీడీపీ నాయకులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ నేతలు మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాల్మన్‌రాజు, వాసు, మునిరత్నంరెడ్డి, రాజేంద్ర, ఎలిజిబెత్, డిస్కో శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయినగర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ డీవీ రమణ ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సామాజిక భద్రతా పింఛన్లు గ్రామస్థులకు అందజేశారు. ప్రతాప్, వినోద్, సుజాతమ్మ, ప్రకాష్ పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం, జూలై 1: మండలంలోని కుప్పంబాదూరు వద్ద ఎమ్మెల్యే పులివర్తి నానీ సతీమణి సుధారెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్దన చౌదరి, హరిప్రసాద్, జేడీ జగన్, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, డిల్లీనాథరెడ్డి, సురేంద్ర నాయుడు పాల్గొన్నారు. చంద్రబాబు చిత్రపటానికి ఎన్ఆర్ కమ్మపల్లె, కమ్మకండ్రిగ, నెత్తకుప్పం, అనుపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు.



నరసింహ యాదవ్‌కు శుభాకాంక్షలు



తిరుపతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం నగరంలో ఘనంగా జరిగాయి. రేణిగుంట రోడ్డులోని కార్యాలయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్, నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, సూరా సుధాకర్ రెడ్డి, చిన్నంగారి రమణ, కృష్ణ యాదవ్, జేబీ శ్రీనివాస్, మహేష్ యాదవ్, రుద్రకోటి సదాశివం, సుబ్బు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తలకోన అడవుల్లో ఎర్రచందనం స్వాధీనం

ఒకరి అరెస్టు



ఎర్రావారిపాలెం, జూలై 1: తలకోన సౌత్‌బీట్ అటవీ పరిధిలోని చింతకుంటసమీపంలో ఎర్రచందనం స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దత్తాత్రేయ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం కటికనహళ్లికి చెందిన సైపుల్లాఖాన్ మరికొంతమందితో కలిసి తలకోన అటవీ ప్రాంతంలో ఎర్రచందనాన్ని తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలో 117 కేజీల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు సైపుల్లాఖాన్‌ను సోమవారం తిరుపతి రెడ్ శాండిల్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. దాడిలో ఫారెస్ట్ అధికారులు నిఖిల్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రశ్రేణి జీఎస్టీ చెల్లింపు సంస్థలుగా శ్రీసిటీ, ఐఎఫ్ఎఫ్



శ్రీసిటీ, జూలై 1: తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సీజీఎస్టీ) కమిషనరేట్ పరిధిలో వస్తుసేవల పన్ను(జీఎస్టీ) ఏడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకటించిన అవార్డుల్లో శ్రీసిటీకి ప్రత్యేక గుర్తింపు దక్కింది. సీజీఎస్‌టీ చెల్లింపుల్లో అగ్రశ్రేణులుగా ప్రకటించిన ఆరు సంస్థల్లో శ్రీసిటీ ప్రైవేట్ లిమిటెడ్, ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎఫ్ఎఫ్) ఎంపికయ్యాయి. జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బ్రిజ్‌లాల్ మీనా, జాయింట్ కమిషనర్ హరిహరన్, చార్టెడ్ అకౌంటెంట్ ఫల్గుణ చేతుల మీదుగా శ్రీసిటీ తరఫున శ్రీసిటీ డైరెక్టర్(ఫైనాన్స్) సుధాకర్‌రెడ్డి, ఐఎఫ్ఎఫ్ తరఫున సంస్థ సీనియర్ అధికారి వెంకట్ భాస్కర్ అవార్డులను అందుకున్నారు.

ఈ దారిలో ఎలా నడిచేది..?

నీరు తొలగింపునకు చర్యలు

తిరుపతిరూరల్, జూలై 1: తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల పంచాయతీ పరిధిలో చైతన్యపురానికి వెళ్లే దారిలో మురుగు, వర్షపు నీరు చేరి చెరువుని తలపిస్తోంది. ఈవీధి గుండా వెళ్లేందుకు పాదచారులు, వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మెయిన్ రోడ్డు నుంచి సంధువీధిలోకి వెళ్లే దారి ప్రారంభంలోనే నీరు నిలచిపోయి చెరువు మాదిరిగా తయారైంది. ఈవీధిలో నివశించే ప్రజలు తమ ఇళ్లకు వెళ్లాలంటే మురుగునీరు అడ్డంగా ఉండటంతో ఎలా వెళ్లాలంటూ వాపోతున్నారు. నీరు చేరడంతో దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసమాచారం తెలుసుకున్న సర్పంచ్ బడి సుధాయాదవ్ సోమవారం ఉదయం ఆ ప్రాంతాన్ని సందర్శించి నీరునిల్వఉండకుండా సత్వర చర్యలు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు.



పుదిపట్ల పంచాయతీల్లో నీరు నిలచి ఉన్నప్రాంతాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ బడి సుధాయాదవ్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



నామినేషన్ దాఖలు చేస్తున్న శ్రీధర్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూలై1: ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని ఎస్వీయూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షస్థానానికి సోమవారం నామినేషన్ దాఖలు చేసిన గుర్రంకొండ శ్రీధర్ అన్నారు. అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేయడం వల్ల అన్ని అంశాలపై అవగాహన ఉందన్నారు.

మున్సిపల్ పాఠశాలల విలీనం జీవో రద్దు చేయాలి

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాలలను విద్యాశాఖ పరిధిలోకి తీసుకొస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 84ను రద్దు చేయాలని మున్సిపల్ టీచర్లు కోరుతున్నారు. మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ విజ్ఞప్తితో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ టీచర్లు మెయిల్స్ చేస్తున్నారు. గత ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా పాఠశాల విద్యాశాఖలో విలీనం చేస్తూ ఏకపక్ష జీవో జారీచేసిందన్నారు. చాలా కాలంగా ఏకీకృత సర్వీసు రూల్స్ అంశం పెండింగ్‌లో ఉందని, పదోన్నతులు అపరిష్కృతంగా ఉన్నాయని, అలాంటప్పుడు ఏకంగా విలీనం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం దీనిని పునఃపరిశీలించి జీవో 84ను రద్దుచేయాలని కోరారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదుల కమిటీ

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో మహిళా ఉద్యోగులపై లైంగింక వేధింపుల నివారణకు అటవీశాఖలో అంతర్గత ఫిర్యాదుల స్వీకరణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా అసిస్టెంట్ సెక్రటరీ లక్ష్మీఅలివేలు, మెంబర్ సెక్రటరీగా సెక్షన్ ఆఫీసర్ రాజేశ్వరి, మెంబర్‌గా ఆశాజ్యోతిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఓపెన్ స్కూల్ ఫలితాల విడుదల

టెన్త్‌లో 63.3%, ఇంటర్‌లో 69.07% ఉత్తీర్ణత

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పరీక్షలు రాసిన అభ్యర్థుల పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం విడుదల చేశారు. టెన్త్‌లో 15058 మందికి గాను 9531 (63.3శాతం) మంది, ఇంటర్‌లో 27279 మందికి గాను 18842(69.07శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. టెన్త్‌లో అబ్బాయిలు 60.53శాతం మంది, అమ్మాయిలు 66.43శాతం మంది, ఇంటర్‌లో అబ్బాయిలు 67.82శాతం మంది, అమ్మాయిలు 71.35శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. టెన్త్ ఉత్తీర్ణతలో తూర్పుగోదారి జిల్లా టాప్‌లో, ఏలూరు చివరన ఉన్నాయి. ఇంటర్‌లో కోనసీమ అగ్రస్థానంలో ఉంటే, నెల్లూరు ఆఖరున నిలిచింది.

నేటి నుంచి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లకు ఉన్నత విద్యామండలి సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. నేటి నుంచి ఈనెల 10 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువు ఇచ్చింది. 5న సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, 11 నుంచి 15 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని సూచించింది. 19న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 20 నుంచి 22లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని స్పష్టంచేసింది. కాగా ఈ ఏడాది మొత్తం 3.5లక్షల వరకు డిగ్రీ సీట్లు అందుబాటులో ఉండనున్నాయి.కాలేజీల యాజమాన్యాలు ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేపట్టాలని కోరగా, ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్‌లోనే ప్రక్రియను ప్రారంభించింది.

టమోటా ధరల పతనం



మదనపల్లె టౌన్, జూలై 1: మదనపల్లె టమోటా మార్కెట్‌లో కేవలం పది రోజుల్లోనే టమోటా ధరలు అమాంతం పడిపోయాయి. పది రోజుల క్రితం గరిష్టంగా కిలో రూ.88 పలికిన టమోటా ప్రస్తుతం రూ.30కి పడిపోయింది. మదనపల్లె మార్కెట్‌కు నిత్యం 600 నుంచి 700 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి వచ్చేది. సోమవారం మార్కెట్‌కు 1424 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రావడం గమనార్హం. దీంతో నాణ్యమైన మొదటి రకం టమోటా ధర గరిష్టంగా కిలో రూ.48 పలకగా, రెండో రకం టమోటా కనిష్టంగా కిలో రూ.30 పలికింది. దీంతో వచ్చే రోజుల్లో టమోటా దిగుబడి ఇదే రీతిలో పెరిగితే ధరలు కిలోకు రూ.10కి పడిపోయినా ఆశ్చర్యం పోనవసరం లేదని వ్యాపారులు అంటున్నారు.

తిరుపతి రూరల్ మండలంలో 94.36శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతిరూరల్, జూలై 1: తిరుపతి రూరల్ మండలపరిధిలో సోమవారం ఉదయం 6గంటలకు ఎమ్మెల్యే పులివర్తి నాని మొదటగా ఓటేరులో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించారు.తుమ్మలగుంటలో పక్షవాత బాధితుడు ఎం.నితిన్‌కు రూ.15వేల పింఛన్‌ను అందించారు. తుమ్మలగుంటలో టీడీపీ జిల్లాప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కరరెడ్డి, రైతునాయకులు బిరుదాల కృష్ణారెడ్డి, భానుప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, మధు, డాలర్స్ దివాకర్ రెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి, బడి సుధాయాదవ్ తదితరులు పాల్గొన్నారు. రూరల్ మండలంలోని 34 పంచాయతీల్లో తొలిరోజు 94.36శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. అదేవిధంగా రూరల్ మండలంలోని వేంకటపతినగర్ పంచాయతీలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉసిరిపాటి శ్రీనివాసులు నేతృత్వంలో 289మందికి పింఛన్లను పంపిణీ చేయగా.. సి.మల్లవరం పంచాయతీలో టీడీపీ గ్రామ ఇన్‌చార్జి మనోహర్‌చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశ్ నాయుడు, నవీన్, అశోక్‌కుమార్, గిరిధర్‌రెడ్డి, షావలి, ప్రభు, గణేష్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. మల్లంగుంటలో మునికృష్ణారెడ్డి, దిలీప్‌కుమార్ యాదవ్‌ల నేతృత్వంలో, చిగురువాడలో కృష్ణమూర్తిరెడ్డి, మురళి, కుమార్, శివయాదవ్, ధనంజయరెడ్డి, కేశవులు, నాగరాజుయాదవ్, భాస్కర్‌రెడ్డిల నేతృత్వంలో పింఛన్లు పంపిణీ చేశారు.



త్వరలో 'రాం భజరంగ్' విడుదల

హీరో సందీప్ మాధవ్



సందీప్ మాధవ్, సుధీర్ వర్మ

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): త్వరలో 'రాం భజరంగ్' చిత్రం విడుదల కానుందని హీరో సందీప్ మాధవ్ తెలిపారు. ఆ చిత్ర దర్శకుడు సుధీర్ వర్మతో కలిసి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సందీప్ మాధవ్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాం భజరంగ్ చిత్రంలో హీరో రాజ్ తరుణ్‌తో కలిసి నటిస్తున్నట్టు తెలిపారు. తిరుమలలో భక్తుల సౌకర్యాలు గతాని కంటే మెరుగుపడ్డాయన్నారు.

మంగళంలో పింఛన్ల పంపిణీ



మంగళం, జూలై 1: మంగళంలో ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పింఛన్ లబ్ధిదారులను శాలువాతో సన్మానించారు. సచివాలయ సిబ్బంది ఉదయం 6గంటలకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను నగదును అందజేశారు. అనంతరం మంగళం గ్రామ పంచాయతీ, సచివాలయ భవనాల వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ మాజీ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, సప్తగిరి కాలనీ పంచాయతీఅధ్యక్షుడు జడారెడ్డి భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి అల్లాబాషా, సుబ్బు యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మంగళం నాని, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రూ.7వేల పింఛన్‌తో తిరుమలవాసుల ఆనందం



తిరుమల, జూలై1 (ఆంధ్రజ్యోతి): రూ.7 వేల ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పండుటాకులు సంతోషపడ్డాయి. టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, తిరుమల టీడీపీ అధ్యక్షుడు రాజుయాదవ్, టీడీపీ, జనసేన కార్యకర్తల ఆధ్వర్యంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలు మహేంద్ర, డిజిటల్ అసిస్టెంట్ గీతకృష్ణ, పంచాయతీ బిల్ కలెక్టర్ మునికృష్ణ తిరుమలలో 127 మందికి పండ్లతో పింఛన్లు అందజేశారు. బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద ఉదయం 10 గంటలకు మొదలుపెట్టి మధ్యాహ్నానికి అందరికీ అందజేశారు. ఇంటికే పరిమితమైన వారికి నేరుగా వెళ్లి పింఛన్లు అందజేశారు.

గాంధీపురాన్ని సందర్శించిన ఆర్డీవో నిశాంత్‌రెడ్డి



తిరుపతిరూరల్, జూలై1: తిరుపతి రూరల్ మండలంలోని గాంధీపురం పంచాయతీని ఆర్డీవో నిశాంత్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. పంచాయతీలో పింఛన్ల పంపిణీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సెక్రటరీ కరుణశ్రీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాకేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించండి

- గత సీఎం తీరుతో మా భవిష్యత్తు అగమ్యగోచరం
- ఎస్పీ ఎదుట నిరుద్యోగ యువత ఆవేదన



ఎస్పీ కార్యాలయం వద్ద నిరుద్యోగ యువత

తిరుపతి(నేరవిభాగం), జూలై 1: గత ఏడాది నవంబరు 28వ తేదీన వెలువడిన 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి దేహదారుఢ్య పరీక్షలు వెంటనే నిర్వహించాలని నిరుద్యోగ యువత కోరింది. ఈ మేరకు సోమవారం ఎస్పీ హర్షవర్ధన్ రాజును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగుల సంఘం నాయకులు వంశీ, సురేష్, దర్బార్ మాట్లాడుతూ.. గత సీఎం తీరుతో తమ భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో ప్రస్తుత సీఎం చంద్రబాబు తమకు న్యాయం చేయాలన్నారు.

బీసీ ఉద్యోగులకు అండగా ఉంటాం : టీడీపీ



బీసీ ఉద్యోగులతో కలిసి ఐక్యతను చాటుతున్న సుధా యాదవ్

తిరుపతి అర్బన్, జూలై 1: బీసీ ఉద్యోగులకు అండగా ఉంటామని టీడీపీ యువ నాయకుడు బడి సుధాయాదవ్ అన్నారు. సోమవారం కొర్లగుంటలోని బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాయాదవ్‌ను ఫెడరేషన్ సమన్వయకర్తగా ఎన్నుకుని, సన్మానించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బి.గోపాల్, ప్రధాన కార్యదర్శి వంకిపురం పవన్, భాస్కర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



రూపేంద్ర

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1: ఎస్వీయూ బయోటెక్ స్కాలర్ జి.రూపేంద్ర డాక్టరేట్ పొందారు. ఎఫెక్ట్ ఆఫ్ ఆల్కహాల్ ఆన్ రీప్రొడక్షన్ ఇన్ హైఫ్యాట్ డైట్ ఇండ్యూస్డ్ ఓబెసి ర్యాట్స్ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 14మందికి జరిమానా

తిరుపతి(లీగల్), జూలై 1: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 14మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. వీరిలో అధిక మోతాదులో మద్యం తాగిన కొర్లగుంటకు చెందిన ఆటోడ్రైవర్ షేక్‌ఖాజాకు జరిమానాతోపాటు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. వీరిని తిరుపతి ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరిబాబు కోర్టులో హాజరుపరిచారు.

నూతన చట్టాలను స్వాగతించిన న్యాయవాదులు



తిరుపతి(లీగల్), జూలై 1: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చినందున తిరుపతి కోర్టుకు సంబంధించిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి న్యాయవాదులు స్వాగతించారు. 170ఏళ్ల నాటి చట్టాలను సవరించి.. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చట్టాలను తీసుకొచ్చారంటూ ప్రధాని నరేంద్రమోదీని కొనియాడారు. తిరుపతి కోర్టు సముదాయం ముందు న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేశారు. కూటమి న్యాయవాదులు సామంచి శ్రీనివాస్, ముక్కు సత్యవంతుడు, నెల్లూరు యోగానంద్, అజయ్‌కుమార్, బాలకృష్ణమనాయుడు, లగిశెట్టి వెంకటరమణ, వేమా వెంకటరత్నం, నర్సింహులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

లీగల్ హెల్ప్‌డెస్క్ సలహాదారుగా ప్రేమ్‌సాగర్



జిల్లా పోలీసు కార్యాలయం లీగల్ హెల్ప్‌డెస్క్ సలహాదారుగా పాకాల ఏపీపీగా పనిచేస్తున్న అప్పా ప్రేమ్‌సాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు తిరుపతి డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వెంకటనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన కారణంగా ఈయన జిల్లా పోలీసులకు అనుమానాలకు నివృత్తి చేయనున్నారు. అలాగే తిరుపతి ఆరో అదనపు మున్సిఫ్ కోర్టు ఏపీపీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

రుయా ఇన్‌చార్జి ఏడీ బాధ్యతల స్వీకారం



ముని రమేష్‌ను సన్మానిస్తున్న ఏపీ హంస నేతలు

తిరుపతి(వైద్యం), జూలై 1: రుయాస్పత్రి పరిపాలన విభాగం ఇన్‌చార్జి ఏడీ(అసిస్టెంట్ డైరెక్టర్)గా ముని రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న ఏడీ రత్నరాజు పదవీ విరమణ చేయడంతో ఆ బాధ్యతలను ఏవో మునిరమేష్‌కు ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా మునిరమేష్‌ను ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో నేతలు సన్మానించారు. ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, మహిళా కార్యదర్శి అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్మూలనకు కృషి చేద్దాం: ఎమ్మెల్సీ

తిరుపతి(వైద్యం), జూలై 1: రాష్ట్రంలో క్యాన్సర్ నిర్మూలనకు కలసి కట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. డాక్టర్స్ డే యూత్ హాస్టల్లో సోమవారం పీఎంపీ(పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్యులు వరప్రసాద్, సందీప్‌రెడ్డి, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాను పకడ్బందీగా నిర్వహించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1: స్టాప్ డయేరియా అవగాహన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో దీనికి సంబంధించిన బ్యానర్, వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, ప్రసంగించారు. సోమవారం నుంచి ఆగస్టు 31వ తేదీవరకు జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. డీఎంహెచ్‌వో శ్రీహరి, ఇమ్యునైజేషన్ అధికారి శాంతకుమారి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి బాలకొండయ్య, డీపీఎంవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- లబ్ధిదారులు ఏమన్నారంటే..

చంద్రబాబే నా పెద్దకొడుకు



భర్తను కోల్పోయి ఒంటరిదానిగా బతుకుతున్నా. ఈమధ్య ఒళ్లు కూడా బాగా ఉండడం లేదు. చంద్రబాబు నాయుడు రూ.4వేల పింఛన్ పెంచడం సంతోషం వేసింది. చెప్పినమాట ప్రకారం ముందు నెలల బాకీలు కూడా కలిపి ఈరోజు రూ.7వేలు చేతికొచ్చింది. ఏ దిక్కూ లేకుండా మంచాన పడివున్న నాకు చంద్రబాబే పెద్దకొడుకు అయ్యాడు.

- ఎస్.సుబ్బమ్మ, వితంతు పింఛను లబ్ధిదారు

బాబు మా ఇంటి దేవుడయ్యాడు



చంద్రబాబు మా ఇంటి దేవుడయ్యాడు. మా ఇంట్లో దీపం వెలిగించాడు. చాలా ఏళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నా. ఎవరూ పట్టించుకోలేదు. ఆస్పత్రికి పోవాలంటే చేతిలో రూపాయిలేదు. ఈటైంలో రూ.15వేలు చేతికి రావడం అంటే ఆ ఆనందం మాటల్లో చెప్పలేకపోతున్నా.

- పి.గంగమ్మ (పక్షవాతం బాధితురాలు)

సంబరంలా పింఛన్ల పంపిణీ

ఒక్కరోజులోనే 96.64 శాతం మందికి నగదు అందజేత





పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ శిరీష తదితరులు - మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎమ్మెల్సీ రామారావు, కూటమి నేతలు

తిరుపతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సోమవారం సంబరంలా ప్రారంభమైంది.ప్రతి డివిజన్లోనూ పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం ఐదు గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఆయా పరిధిలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు చేరుకున్నారు. తొలుత 35వ డివిజన్ భవానీనగర్లో పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ రామారావు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మేయర్ శిరీష, తుడా మాజీ చైర్మన్లు ఎన్వీ ప్రసాద్, నరసింహ యాదవ్, కమిషనర్ అదితిసింగ్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు పాల్గొని.. అవ్వాతాతలకు పింఛను సొమ్ము అందజేశారు. ఎమ్మెల్యే దాదాపు 18 డివిజన్లలో పర్యటించి పింఛన్లు పంపిణీ చేశారు. అదేవిధంగా 36 డివిజన్‌తోపాటు చెన్నారెడ్డి కాలనీ, గిరిపురం, ఐఎస్‌మహల్, ఇందిరానగర్, ఎంఆర్‌పల్లెలో పింఛన్లను పంపిణీ చేశారు.నగరంలో 19,343మంది లబ్ధిదారులకు రూ.13,30,16,500 పంపిణీ చేయాల్సి ఉండగా.. రాత్రి ఏడు గంటల సమయానికి 18,693మందికి రూ.12,85,52,2500 అందించారు.మొత్తం 96.64శాతం పింఛన్లు తొలిరోజు పంపిణీ చేశారు. మిగిలిన 3.36 శాతం మందికి మంగళవారం అందజేయనున్నారు.

మా ప్రభుత్వం పేదల పక్షమని నిరూపించాం: ఆరణి

అవ్వాతాతలకు మూడు నెలల పెండింగ్‌తో కలిపి రూ.7వేలను అందించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని నిరూపించామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చింది గోరంత.. ప్రచారం మాత్రం కొండంత అని విమర్శించారు. రూ.3వేల పింఛన్ ఇస్తామని చెప్పి.. విడతల వారీగా ఇచ్చి అవ్వాతాతలను జగన్ మోసం చేశారని ఆరోపించారు. ఆర్భాటానికి తావు లేకుండా లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమను ఆదేశించినట్లు చెప్పారు. ఒకేసారి పెంచిన పింఛను డబ్బు ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, ఊకా విజయకుమార్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, జేబీ శ్రీనివాస్, అన్నా రామచంద్రయ్య, పొలకల మల్లిఖార్జున్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, ఊట్ల సురేంద్ర నాయుడు, దంపూరి భాస్కర్, చినబాబు, మహేష్ యాదవ్, బుల్లెట్ రమణ, నాగభూషణం, మునిశేఖర్ రాయల్, భరణి యాదవ్, ఈతమాకుల హేమంత్ కుమార్, అన్నా రామకృష్ణ, పాతకం వెంకటేష్, రాజారెడ్డి, అజయ్ కుమార్, పొనగంటి భాస్కర్, కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, కల్పన యాదవ్, సీకే రేవతి, నారాయణ, కార్పొరేషన్ ఉప కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డీఈలు విజయకుమార్ రెడ్డి, శ్రావణి, ఆర్వో గాలి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోటబైలులో పింఛన్ల పంపిణీ



కోటబైలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

భాకరాపేట, జూలై 1: చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలులో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పులివర్తి నాని పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, తహసీల్దారు నాగరాజు, డీటీ అన్వర్‌బాషా, కార్యదర్శి సతీశ్, టీడీపీ నాయకులు బెల్లగొండ మురళీ, శివకుమార్, మదనమోహన, చిట్టెమ్మ, సునీతా దామోదరం, విజయశేఖర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, ఆర్వీరమణారెడ్డి, ముత్తం ప్రభాకర్, చంద్రశేఖర్, గురుమూర్తి, వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం, మల్లిఖార్జునరెడ్డి, మునస్వామి నాయుడు, కృష్ణమూర్తి, మస్తాన్ సాహెబ్, రఫీ, రమేశ్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, మౌలాలి, బెల్లంకొండ రమణ, కుమారస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని టీడీపీ శ్రేణులు లబ్ధిదారులతో కలిసి చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. చిన్నగొట్టిగల్లు మండలంలో మొత్తం 4811 పింఛన్లకు గాను 4536 పింఛన్లు సోమవారం పంపిణీ చేశారు.

ఎర్రావారిపాలెంలో...



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాలెం, జూలై 1: మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీలో ఎమ్మెల్యే పులివర్తి నాని పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ప్రభుత్వంపై ఎంతో విశ్వాసం ఉంచి గెలిపించారని, వారి అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

ఇచ్చిన మాట నిలుపుకున్న చంద్రబాబు : టీడీపీ



తిరుపతి (జీవకోన), జూలై 1: సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని టీడీపీ నేత, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం 32వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల కు పింఛను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు దేవరాజులు ఆచారి, మహేష్, చంద్ర, నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు యువత నేతకు సన్మానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1: తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్‌ని జన్మదినం సందర్భంగా పలువురు సన్మానించారు. సోమవారం ఎస్వీయూనివర్సిటీలోని అన్నమయ్య భవన్ ముందు భారీ కేక్ కట్ చేసిన ఆయనకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రి నాయుడు, హరికృష్ణ యాదవ్, పత్తిపాటి వివేక్ చౌదరి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నేత ఆర్కేనాయుడు, నాయకులు అశోక్, బషీర్, బిసన్న, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

బాధితులకు సత్వరం న్యాయం చేయాలి

- అధికారులకు ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశం
- కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 49 అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1: బాధితులకు సత్వర న్యాయం చేయాలని అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 49 అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూశాఖకే 35 ఉండటం గమనార్హం. ఇన్‌చార్జి కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, ఎస్‌డీసీ మురళి, దేవేంద్రరెడ్డి తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

పండుటాకుల సమస్యపై స్పందించిన ఇన్‌చార్జి కలెక్టర్



సమస్యను తెలుసుకుంటున్న డీఎల్‌పీవో

రేణిగుంట మండలం తూకివాకంలోని ఆశ్రయ స్వచ్ఛంద సంస్థలో సుమారు 50మందికి పైగా వృద్ధులు, దివ్యాంగులు పునరావాసం పొందుతున్నారు. వీరిలో 90శాతం మందికి ఆధార్ కార్డు లేకపోవడంతో పింఛను రావడం లేదు. వీరంతా ఆధార్, పింఛను కోసం కలెక్టరేట్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి కలెక్టర్, డీఆర్వో స్పందించి వారి సమస్యను పరిష్కరించాలని డీఎల్‌పీవో సుశీలాదేవికి సూచించారు. ఆమె వారివద్దకెళ్లి వివరాలు తెలుసుకున్నారు. వారంలోపు ఆధార్ కార్డులతో పాటు త్వరలో పింఛన్లు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. దాంతో అధికారులకు ఆ పండుటాకుతోపాటు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

గత ప్రభుత్వం మోసం చేసింది: గురవయ్య



అయ్యా మాది ఏర్పేడు మండలం మేర్లపాక హరిజనవాడ. దళితకుటుంబానికి చెందినవాడిని. నాకు 1.50ఎకరా భూమి ఉండేది. జగనన్న ఇంటి స్థలం కోసం ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం బలవంతంగా భూమి తీసుకుంది. ఇంత వరకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వలేదు. ఈ ప్రభుత్వమైనా స్పందించి న్యాయం చేయాలి.

ఆక్రమణలు వెంటనే తొలగిస్తాం

పీజీఆర్ఎస్‌లో కమిషనర్ అదితిసింగ్



సమస్యలు తెలుసుకుంటున్న అదితి సింగ్

తిరుపతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కల్గిస్తున్న ఆక్రమణలను వెంటనే తొలగిస్తామని కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 33వ డివిజన్ కార్పొరేటర్ దూది కుమారి భర్త శివ వినతి పత్రం ఇస్తూ.. అశోక్ నగర్లోని పెద్ద కాలువలో సిల్ట్ తొలగించాలని, స్కావెంజర్స్ కాలనీలో యూడీఎస్ పొంగి పొర్లుతోందని, తిరుమల బైపాస్ రోడ్డులో నిర్మించిన అక్రమ దుకాణాలను తొలగించాలని కోరారు. మారుతీనగర్, రాయల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ నిర్మించిన సీసీ రోడ్డుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇరువైపులా రెండు గేట్లను పెట్టించడంతో సామాన్య ప్రజలు రాకపోకల కోసం ఇబ్బందులు పడుతున్నారని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సూచనలమేరకు టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు ఫిర్యాదు చేశారు. శెట్టిపల్లెలో లేఅవుట్‌ను క్రమబద్ధీకరించి, ప్లాట్లను కేటాయించాలని, బ్లిస్ దగ్గర మురుగు రోడ్డుపై ప్రవహిస్తోందని, తదితర సమస్యలపై అర్జీలు అందాయి. వీటన్నింటినీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలకు అధిక ప్రాధాన్యం: ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 1: వృద్ధుల సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 55 అర్జీలు అందాయి. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి.. తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ చెప్పారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, డీఎస్పీలు రవిమనోహరాచారి, సీఐ జయనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య వృత్తి దేవుడిచ్చిన వరం



సమావేశంలో ప్రసంగిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), జూలై 1: వైద్య వృత్తి దేవుడు ఇచ్చిన వరమని, పేదలకు నిస్వార్థ సేవలు అందించినప్పుడే సార్థకత లభిస్తుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం స్విమ్స్‌లో ఐఎంఏతో కలిసి వైద్యులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్వీ కుమార్ మాట్లాడుతూ.. ఈ ఏడాది థీమ్ హీలింగ్ హ్యాండ్స్, కేరింగ్ హార్ట్ అనే నినాదంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, డీఎంహెచ్‌వో శ్రీహరి పలు విషయాలను వివరించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ఐఎంఏ నేతలు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, డాక్టర్ జనార్దన్, డాక్టర్ వెంకట్రమణ, డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ రాయపు రమేష్ తదితరులు పాల్గొన్నారు. ● రష్ ఆస్పత్రిలో అధినేత, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు సిపాయి కీర్తి సాగర్‌రెడ్డి, మౌనరెడ్డి, కృష్ణకాంత్, శ్రీగౌరి తదితరులు పాల్గొన్నారు.



స్టెతస్కోప్ ఆకారంలో అట్లాంటిస్ స్కూల్ విద్యార్థులు



వైద్యుల వేషధారణల్లో లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు

తిరుపతి(విద్య) : యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి పూర్వ విద్యార్థి డాక్టర్ డి.పూర్ణచంద్రారెడ్డి హాజరయ్యారు. చైర్‌పర్సన్ ఎం.రమాదేవి, కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ శ్వేతారెడ్డి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, టీచర్లు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం: పాశం

గూడూరు, జూలై 1: ఎన్నికల సమయంలో అవ్వాతాతలకు పింఛన్ పెంచుతానని ఇచ్చిన హామీను నిలబెట్టుకుని వృద్ధులకు భరోసాగా నిలిచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణం సహా పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లకు కేవలం రూ.వెయ్యి అది సంవత్సరానికి రూ.250 లెక్కన పెంచిందన్నారు. సీఎం చంద్రబాబు ఏకమొత్తంగా రూ.1000 పెంచి రూ.4వేలు చేశారన్నారు. ఏప్రిల్ నెల నుంచే పింఛన్‌ను వర్తింప చేసి మరో రూ.3 వేలు అందించారన్నారు. ఉదయం 6గంటలకే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెంచిన పింఛన్‌ను పంపిణీ చేయడంతో వారి ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది. పులిమి శ్రీనివాసులు, శివకుమార్, నాగరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. 7వ వార్డులో చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే పాశం సతీమణి సంధ్యారాణి పాలాభిషేకం చేసి పింఛన్ల పంపిణీ చేశారు. సొసైటీకాలనీలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్, నెల్లటూరులో టీడీపీ కార్యదర్శి రాష్ట్ర నెలబల్లి భాస్కర్‌రెడ్డి సమా గ్రామాలలో కూటమి నాయకులు పింఛన్లు అందజేశారు.


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తడ, జూలై 1: స్థానిక ఐటీఐలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. జూలై 24వ తేదీ లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటిఐ.ఎన్‌సివి.ఇన్‌లో తమ దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. 27, 28 తేదీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

టీం ఇండియాకు అభినందనలు



గూడూరు, జూలై 1: టీ20 ప్రపంచకప్ సాధించిన ఇండియా జట్టుకు గాయత్రి పాఠశాల విద్యార్థులు అభినందనలు తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులు బ్యాట్, బాల్ ఆకారంలో కూర్చుని టీం ఇండియాకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు మరువలేనివి


వైద్యులను సన్మానిస్తున్న ప్రగతి సంస్థ ప్రతినిధులు

గూడూరు అర్బన్, జూలై 1: వైద్యుల సేవలు మరువలేనివని డాక్టర్ జనార్దన రెడ్డి అన్నారు. సోమవారం ఏరియా ఆసుపత్రిలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొవిడ్ లాంటి విపత్కర పరిస్థితులలో వైద్యుల సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము తదితరులు పాల్గొన్నారు. రోటరీ భవన్‌లో డాక్టర్లు జనార్దన రెడ్డి, రోహిణి, మైథిలి, హరిప్రసాద్, రమణయ్య, నరేష్‌కుమార్, పటేల్, శివకుమార్, రాజేంద్రకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మునిగిరీష్, శ్రీధర్‌రెడ్డి, జీజీనాయుడు, మయూరి శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



గూడూరు అర్బన్, జూలై 1: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూని నివారించవచ్చునని వైద్యశాఖ సబ్ యూనిట్ అధికారి రామరాజు అన్నారు. సాధుపేటలో వైద్యశాఖ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అపరిశుభ్ర వాతావరణం వలన దోమలు పెరిగి డెంగ్యూకి కారణమవుతుందన్నారు. సిబ్బంది విక్టోరియా, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

గూడూరు అర్బన్, జూలై 1: పట్టణానికి తాగునీరు అందించే పైపులైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 3, 4 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సోమవారం చెప్పారు. ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు.

శ్రీనిధి రుణాలు పొందండి



కోట, జూలై 1: వాణిజ్య బ్యాంకుల్లో తీసుకున్న స్త్రీనిధి లోన్‌ను సకాలంలో చెల్లించి మలివిడత రుణాలు పొందాలని వెలుగు సీసీలు ప్రసాద్, శంకరయ్య, భాస్కర్ చెప్పారు. మండల పరిధిలోని సిద్ధవరంలో సోమవారం శ్రీనిధి రుణాలపై సంఘ అధ్యక్షురాలితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపట్నం, సిద్ధవరం పంచాయతీల్లో పొదుపు సంఘాల మహిళలు స్త్రీనిధి రుణాలు పొందేందుకు నివేదికలు తయారు చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అర్హుల జాబితాను తయారు చేయాలన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించండి



చిల్లకూరు, జూలై 1: తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యంపై అవగాహన కల్పించి బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపించేలా మండలంలోని చింతవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రహూఫ్ మాట్లాడుతూ గ్రామాల్లో పిల్లలను గుర్తించి వారు బడికి వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. తలిదండ్రులు పిల్లలను పనులకు పంపకుండా బడికి పంపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహక బహుమతి

చిల్లకూరు, జూలై 1: మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదవిన సాజిదా టెన్త్‌లో 539 మార్కులు సాధించడంతో సోమవారం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 10వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్ర మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు రాజనేని పిచ్చయ్యనాయుడు, మాధవయ్య, వీవీ కుమార్, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ఏదో చెప్పుకోలేని స్థితిలో ఉన్నాం

ఎమ్మెల్యే కురుగొండ్ల

బాలాయపల్లి, జూలై 1: గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర రాజధాని ఏదో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాలాయపల్లి, వెంగమాంబపురంలలో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంగమాంబపురంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... తమ పార్టీ అధినేత చంద్రబాబు సీఎం అవగానే రాజధాని అమరావతిలో పనులను వేగంగా చేపడుతున్నారన్నారు. రాష్ట్రంలో పేదరికం అనేది లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారన్నారు. అంతకుముందు ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, నాయకులు భాస్కర్‌రావు, సి.సి.నాయుడు, కె.రామచంద్ర నాయుడు, బి.కల్యాణ్ రెడ్డి, తహసీల్దార్ కె పుల్లారావు, ఎంపీడీవో ఎ.అరుణ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరండి


దిశా నిర్దేశం చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

వాకాడు, జూలై 1 : ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వాకాడు మండలానికి ఈ నెల 4న వస్తున్న పాశం సునీల్‌కుమార్ విజయోత్సవ ర్యాలీకి పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు డి.మధుసూదన్‌రెడ్డి కోరారు. మండలంలోని ఏఎంసీ కార్యాలయం వద్ద జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వాకాడు అశోక్‌పిల్లర్ నుంచి బీసీ కాలనీ మీదుగా గొల్లపాళెం వరకు ద్విచక్రవాహన ర్యాలీ కొనసాగుతుందన్నారు. గూడూరు బీజేపీ కన్వీనర్ పి.పురుషోత్తమరెడ్డి, డి.కృష్ణమూర్తి, నందగోపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, ఎం.గోవిందయ్య, వి.సంపత్‌కుమార్, వల్లిప్రసాద్, ద్వారకానాథ రెడ్డి, టి.మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లలో ఆనందం చూశా: విజయశ్రీ


సూళ్లూరుపేట పట్టణంలో ఫించన్ అందిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 1: అవ్వాతాతల కళ్లలో ఆనందం చూశానని పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం సూళ్లూరుపేట పట్టణంలోని సూళ్లూరు, కోళ్లమిట్ట, రాఘవయ్యపేట, సాయి నగర్ తదితర ప్రాంతాల్లో పెంచిన పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ముందుగా ఆమె పార్టీ నాయకులు, అధికారులతో కలిసి సూళ్లూరు సచివాలయ పరిధిలోని సూళ్లూరు, నాగరాజపురం ప్రాంతాల్లో ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇళ్లకెళ్లి పింఛన్లను అందజేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పింఛన్ల ప్రవేశపెట్టింది, పెంచింది టీడీపీయే అని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే ఫించన్ అందజేయాలని ఈసీ ఆదేశాలిచ్చిన వలంటీర్లు లేనిదే సాధ్యంకాదని కుంటి సాకులు చెప్పి అనేక మంది వృద్ధులను పొట్టన పెట్టుకుందన్నారు. సచివాలయ సిబ్బందితో ఇంటింటికి ఫించన్ ఇచ్చి ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం మండల పరిధిలోని మంగళంపాడులో కూడా ఎమ్మెల్యే ఫించన్ల పంపిణీలో పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం నుంచే ఫించన్ల అందజేసే కార్యక్రమాన్ని పగడ్బందీగా చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని రాష్ట్రంగా ఏపీ: కురుగొండ్ల


వెంకటగిరి పట్టణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, జూలై 1: పట్టణంలోని 5, 6, 7, 9 వార్డుల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని ఎన్టీఆర్ ఈ పథకాన్ని ప్రవేశ పెడితే దాన్ని అంచెలంచెలుగా పెంచింది సీఎం చంద్రబాబని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పింఛను నెలకు రూ.4వేలు చేసి, వికలాంగులకురూ రూ.6వేలు, డయాలసిస్ బాధితులకు రూ.15 వేలు అందించామని ఎమ్మెల్యే అన్నారు. జి.మురళి, బి.రాజేశ్వరరావు, కాపా శ్రీనివాసులు నాయుడు, ఏ.సత్యనారాయణ, టి.క్రిష్ణయ్య, ఎం.బాబు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: ప్రతి ఇంటికీ వెళ్లి అవ్వాతాతలకు పింఛను అందిస్తుంటే వారి కళ్లల్లో ఆనందం కనిపించిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. డక్కిలి మండలం నాగవోలు వడ్డిపల్లి, మోపూరు రోడ్డు, డి.ఉప్పరపల్లి, గొల్లపల్లిల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధాప్యంలో వారికి అండగా ఇంటి పెద్ద బిడ్డగా నిలవాలన్న ఉద్దేశంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. డి.ఉప్పరపల్లి, నడింపల్లెల్లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎ.రామచంద్రయ్య నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు పి.కోటేశ్వరరెడ్డి, డి.ఉప్పరపల్లి సర్పంచ్ ఏ.ఎం.రత్నం, టీడీపీ అధికార ప్రతినిధి ఏ.శ్రీరాములు నాయుడు, ఆర్.రాజా, ఎంపీడీవో లలీలామాధురి తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి ప్రదాత చంద్రబాబు


నాయుడుపేట పట్టణంలో పింఛన్ పంపిణీలో నెలవల - తడలో పింఛన్ల పంపిణీ - చిల్లకూరులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

నాయుడుపేట టౌన్, జూలై 1: అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి చంద్రబాబు అని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని మార్కెట్ వీధిలో సోమవారం ఉదయం 6 గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రూ.200 ఉన్న పింఛనును ఒక్కసారి రూ. 1000కి పెంచిన చంద్రబాబు, ఆ తరువాత రూ.2వేలు చేసి ప్రస్తుతం రూ.4వేలు అందిస్తున్నారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రఫీ, ఎస్.రాజేష్, పి.భాస్కర్, జి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని కొత్తూరు, తాళ్వాయిపాడుల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పంపిణీ చేశారు. కొత్తూరు గ్రామంలో నడవలేని స్థితిలో ఉన్న 95 ఏళ్ల వృద్ధురాలి ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు. సచివాలయ ఉద్యోగులతో పాటు టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి పింఛన్‌లను పంపిణీ చేశారు. పెళ్లకూరులో పేరం రమేష్‌నాయుడు, కొత్తూరులో సంచి కృష్ణయ్య, చిల్లకూరులో పి.రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది. ఎంపీడీవో అన్నపూర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : పట్టణ పరిధిలో ఉదయం 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 4,177 మందికి అందించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. సోమవారం సాయంత్రానికి 95 శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో 5,999 పింఛన్లను అందజేసే లక్ష్యంగా ఏర్పాటు చేయగా, సాయంత్రానికి 96.58 శాతం పంపిణీని చేసినట్లు ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు.

తడ: గ్రామాల్లో పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. కాదలూరులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, రామాపురంలో మాజీ ఎంపీ వెలగపల్లి వరప్రసాద్‌రావు, భీములవారిపాళెంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, వాటంబేడులో టీడీపీ మత్స్యకార నాయకుడు బి.పళణి, ఇరకంలో టీడీపీ నాయకుడు జయపాల్, కారూరులో నీలకంఠం, జీవ, పూడిలో సెల్వంల ఆధ్వర్యంలో 7వేల రూపాయల పింఛన్ మొత్తాలను లబ్ధిదారులకు అందజేశారు.

చిల్లకూరు: మండలంలోని గొల్లపాళెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ ఆధ్వర్యంలో అందించారు. చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, బెల్లకొండ శివకుమార్, నవీన్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని తిప్పగుంటపాళెంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఓడూరులో తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి కూటమి నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

కోట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలా జరిగింది. మండలంలోని 7,156 పింఛన్లకు సంబంధించి 4,94,900 రూపాయలను మంజూరు కావడం జరిగింది. అందులో సాయంత్రంకల్లా ఆయా ఎంపీడీవో శంకరయ్య, తహసీల్దారు నాగరాజరావు సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి 6,287 మంది పింఛన్ దారులకు నగదు పంపిణీ చేశారు. కోట పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, దశరథరామిరెడ్డి, రమేష్, కోటేశ్వరరెడ్డి, జి.సుష్మారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మస్తాన్ బాషా ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలా జరిగింది.

చిట్టమూరు: టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో చిట్టమూరు, కొత్తగుంట తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు పెంచిన పింఛను పంపిణీ చేయగా పలు చోట్ల కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పలు చోట్ల సీఎంకు దిష్టి తగలకూడదంటూ టెంకాయలు, గుమ్మడికాయలు కొట్టారు. కొత్తగుంటలో వృద్ధురాలు కిష్టమ్మ పింఛన్ తీసుకుని బాబు చిత్రపటం చూపించి తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో గణపర్తి గోపాల్ నాయుడు, బాబునాయుడు, మోహన్‌నాయుడు, సర్పంచ్ కోటయ్య, బషీర్, శతీష్, సుధ, బాలక్రిష్ణ, సురేష్ తదితరులు ఉన్నారు.

వాకాడు: రాష్ట్ర ప్రభుత్వం జూలై 1న సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రూ.3వేల నుంచి పెంచిన రూ.4వేల పింఛనును మండలంలోని 19 పంచాయతీల్లో పండగ వాతావరణంలో పంపిణీ చేశారు. దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, తుమ్మల మోహన్‌నాయుడు, కుంచం దయాకర్, యర్రబోతు రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలో పింఛన్ల పంపిణీలో సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఆయా గ్రామాలలో పింఛన్లు అందుకున్న లబ్దిదారులు తమకు ఈ పర్యాయం సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అందిన మొత్తంపై వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. కాగా ఆయా గ్రామాలలో జరిగి ఈ కార్యక్రమాలలో పార్టీ మండల యంత్రాంగం పూర్తిస్థాయిలో పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండలంలో 11 సచివాలయాల పరిధిలో 4916 మంది ఫించన్‌దారులు ఉండగా, వారిలో 4195 మందికి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే విజయశ్రీ పంపిణీని పర్యవేక్షించారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, నాయకులు పామంజి శ్రీనివాసులు, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, దేవాడి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పించింది



ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచి ఇవ్వడం భరోసాను కల్పించింది. గత ప్రభుత్వంలో 1000 రూపాయలు పెంచేందుకు ఐదేళ్లు పట్టింది. రూ.3వేలు ఉన్న పింఛన్‌ను ఒకేసారి రూ. 1000 పెంచి రూ. 4వేలు చేయడంతోపాటు ఏప్రిల్ నెల నుంచే పింఛన్ ఇస్తామని చెప్పి రూ. 7వేలు ఇవ్వడం ఆనందాన్ని నింపింది. నాలాంటి వారికి పెంచిన పింఛన్ ఎంతో ఉపయోగపడుతుంది.

- కొళ్లాపురమ్మ, చిల్లకూరు మండలం

మాలాంటోళ్లకు వరం



పెంచిన పింఛన్ మాలాంటి దివ్యాంగులకు వరం. మంచానికే పరిమితమైన నాకు గత ప్రభుత్వం నెలకు రూ. 3వేలు పింఛన్ అందించేది. ఇప్పుడు సీఎం చంద్రబాబు రూ. 3వేలను రూ. 6వేలుగా చేసి అందిస్తున్నారు. ఈ పింఛన్‌తో పోషణభారం కొంత తగ్గుతుంది. ఇంటి పెద్దగా ఆలోచించి చంద్రబాబు పింఛన్‌ను రూ.6వేలు ఇవ్వడం సంతోషంగా ఉంది.

- డీఆర్ దేవరాజ్, బాలాయపల్లి మండలం

అగ్రశ్రేణి జీఎస్టీ చెల్లింపు సంస్థలుగా శ్రీసిటీ, ఐఎఫ్ఎఫ్



శ్రీసిటీ, జూలై 1: తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సీజీఎస్టీ) కమిషనరేట్ పరిధిలో వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ఏడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకటించిన అవార్డుల్లో శ్రీసిటీకి ప్రత్యేక గుర్తింపు దక్కింది. సీజీఎస్టీ చెల్లింపుల్లో అగ్రశ్రేణులుగా ప్రకటించిన ఆరు సంస్థల్లో శ్రీసిటీ ప్రైవేట్ లిమిటెడ్, ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎఫ్ఎఫ్) ఎంపికయ్యాయి. జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బ్రజ్‌లాల్ మీనా, జాయింట్ కమిషనర్ హరిహరన్, చార్టెడ్ అకౌంటెంట్ ఫల్గుణ చేతుల మీదుగా శ్రీసిటీ తరపున శ్రీసిటీ డైరెక్టర్(ఫైనాన్స్) సుధాకర్‌రెడ్డి, ఐఎఫ్ఎఫ్ తరపున సంస్థ సీనియర్ అధికారి వెంకట్ భాస్కర్ అవార్డులను అందుకున్నారు.

పండుటాకుల సమస్యపై స్పందించిన ఇన్‌చార్జి కలెక్టర్


సమస్యను తెలుసుకుంటున్న డీఎల్‌పీవో సుశీలాదేవి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1: రేణిగుంట మండలం తూకివాకంలోని ఆశ్రయ స్వచ్ఛంద సంస్థలో సుమారు 50మందికిపైగా వృద్ధులు, దివ్యాంగులు పునరావాసం పొందుతున్నారు. వీరిలో 90శాతం మందికి ఆధార్ కార్డు లేకపోవడంతో పింఛను రావడం లేదు. వీరంతా ఆధార్, పింఛను కోసం కలెక్టరేట్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి కలెక్టర్, డీఆర్వో స్పందించి వారి సమస్యను పరిష్కరించాలని డీఎల్‌పీవో సుశీలాదేవికి సూచించారు. ఆమె వారివద్దకెళ్లి వివరాలు తెలుసుకున్నారు. వారంలోపు ఆధార్‌కార్డులతో పాటు త్వరలో పింఛన్లు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు.

గత ప్రభుత్వం మోసం చేసింది: గురవయ్య



అయ్యా మాది ఏర్పేడు మండలం మేర్లపాక హరిజనవాడ. దళితకుటుంబానికి చెందినవాడిని. నాకు 1.50ఎకరా భూమి ఉండేది. జగనన్న ఇంటిస్థలం కోసం ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం బలవంతంగా భూమి తీసుకుంది. ఇంత వరకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వలేదు. ఈ ప్రభుత్వమైనా స్పందించి న్యాయం చేయాలి.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. నగిరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌రెడ్డి, ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రామారావు, శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, సినీ నటుడు తిరువీర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


గూడూరులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

గూడూరు, జూలై 1: చట్టాల పేర్ల మార్పుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం పాత బస్టాండు సమీపంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రతకు, ప్రజల రక్షణకు నూతన చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో కొత్త చట్టాలను సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయన్నారు. నూతన చట్టాల ద్వారా నిర్ణీత కాలంలో బాధితులకు కోర్టులో న్యాయం జరుగుతుందని తప్పుడు కేసులు పెట్టేవారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ రవికిరణ్, ఎస్ఐలు శ్రీహరిబాబు, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: చట్టాలతో ప్రజలకు రక్షణ ఉంటుందని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలు వ్యక్తిగత భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు హామీ ఇస్తున్నాయన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ గోపీ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: భారతీయ చట్టాలపై న్యాయ వ్యవస్థ కీలక మార్పులు చేసిందని సీఐ సంగమేశ్వరరావు చెప్పారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ అన్ని పోలీస్ స్టేషన్లలో జీరో ఎఫ్ఐఆర్, సమ న్యాయం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులపై వారి పిల్లలు స్నేహంతో మెలగాలన్నారు. ఏఎస్ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: కొత్తగా వచ్చిన చట్టాల పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సోమవారం ఆయన సూళ్లూరుపేటలో పోలీసు సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండు వద్ద కరపత్రాలు అందజేసి క్షుణ్ణంగా వివరించారు. సీఐ మధుబాబు, ఎస్ఐ కోట రహీం రెడ్డి తదితరులు ఉన్నారు.

త్వరలో 'రాం భజరంగ్' విడుదల

హీరో సందీప్ మాధవ్



తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): త్వరలో 'రాం భజరంగ్' చిత్రం విడుదల కానుందని హీరో సందీప్ మాధవ్ తెలిపారు. ఆ చిత్ర దర్శకుడు సుధీర్ వర్మతో కలిసి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సందీప్ మాధవ్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాం భజరంగ్ చిత్రంలో హీరో రాజ్ తరుణ్‌తో కలిసి నటిస్తున్నట్లు తెలిపారు. తిరుమలలో భక్తుల సౌకర్యాలు గతానికంటే మెరుగుపడ్డాయన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించింది.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

సత్యవేడు, జూలై 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి దేశ వ్యాప్తంగా కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. నూతనంగా చట్టాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగా ప్రకారం విచారణ వేగవంతంగా పూర్తవడమే కాకుండా, బాధితులకు సకాలంలో న్యాయం అందనుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వీరాంజనేయులు పాల్గొన్నారు.

చెంచయ్య నాయుడికి సత్కారం



శ్రీకాళహస్తి, జూలై1: శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్య నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నియో జకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు ఆయను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిత్తూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం మాజీ కార్యనిర్వా హక కార్యదర్శి బొడుగు మునిరాజ యాదవ్, తెలుగుయువత నేతలు జగదీష్ నాయుడు, నరేంద్ర నాయుడు, శేషాద్రినాయుడు తదితరులు చెంచయ్య నాయుడిని సన్మానించారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నిక

శ్రీకాళహస్తి, జూలై 1: శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా బొమ్మన మధుసూదనరావు, ఉపాధ్యక్షుడుగా కొండేటి చక్రపాణి, కార్యదర్శిగా కొండేటి గోపాల్, కోశాధి కారిగా పెళ్లూరు కార్తీక్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా అమరా జనార్దన రావు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుబ్బరామ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా పోస్టర్ల అవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 1: స్టాప్ డయేరియా పోస్టర్లను ఎంపీడీవో, సీడీపీవో, ఎంఈవో రవీంద్రనాథ్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దివాకర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు ఉత్పత్తి చెందుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వార్డెన్ రామయ్య పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్‌డే వేడుకలు

శ్రీకాళహస్తి, జూలై 1: శ్రీకాళహస్తి పట్టణంలో డాక్టర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో డైరెక్టర్ గుడ్లూర్ మయూర్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, నాయుడుపేట తదితర ప్రాంతాల్లోని సుమారు వంద మంది వైద్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని పీపుల్స్ నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్స్‌డే వేడుకలు జరిగాయి. డాక్టర్ బత్తెయ్యనాయుడు కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో నాగూరయ్య, వెంకటముని, గోపి, వీరరాఘవరెడ్డి, శివ పాల్గొన్నారు.

డాక్టర్లను సన్మానించిన రైల్వే పెన్షనర్లు


డాక్టర్లను సన్మానిస్తున్న రైల్వే పెన్షనర్లు

రేణిగుంట, జూలై 1: సీఆర్ఎస్ రైల్వే ఆస్పత్రిలో డాక్టర్స్ డే నిర్వహించారు. ఆస్పత్రి ఇన్‌చార్జి నరసింహ నిశాంత్, వైద్యులు కుమార్, హిమజ, వెంకట పవన్, రెహనా పఠాన్‌ను రైల్వే పెన్షనర్లు సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు అసన్ సాహెబ్, జయంతికుమార్, సర్పంచ్ నగేశం, శేఖర్, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విద్యతో పేదరికాన్ని తరిమికొట్టండి

ఏర్పేడు, జూలై 1: విద్యతో పేదరికాన్ని తరిమికొట్టాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం బండారు పల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన విద్యాసామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు శివశంకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నిర్మల్‌కుమార్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్‌గా శామ్యూల్ అరవింద్

సత్యవేడు, జూలై 1: సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా జీ.శామ్యూల్ అరవింద్ నియమితులయ్యారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న సురేష్‌బాబు పదవీ విరమణ చేయడంతో ఎకనమిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శామ్యూల్ అరవింద్‌కు ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్ప గిస్తూ రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం
రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం

నాగలాపురం, జూలై 1: నాగలాపురంలోని తూర్పు దళితవాడలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. రెవెన్యూ అధికారుల వివరాల మేరకు... ఆదివారం రాత్రి తూర్పు దళితవాడకు చెందిన లక్ష్మణన్ ఇంటి ఏసీలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటల చెలరేగాయి. దీంతో ఇళ్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న లక్ష్మణన్, అతని భార్య, ఇద్దరు పిల్లలు స్వల్పంగా గాయపడ్డారు. సోమవారం ఉదయం తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో బాబు, వీఆర్వో నాగభూషణం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. రూ.50 వేల నగదు, 10 సవర్ల బంగారు నగలు, విద్యుత్ పరికరాలు దగ్ధమవ్వడంతో సుమారు రూ.5లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని అంచనా వేశారు. విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బాధితులను పరామర్శించి రూ.10వేల నగదు, 50 కిలోల బియ్యం అందించారు.

చక్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూలై 1: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన చక్రేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహ కులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, జూలై 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామివారికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పింఛను పెంపు చరిత్రాత్మకం: బృందమ్మ



శ్రీకాళహస్తి పట్టణం మిట్టకండ్రిగలో పింఛను పంపిణీ చేస్తున్న బొజ్జల బృందమ్మ, తంగేళ్లపాళెం గ్రామంలో పింఛను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి, జూలై 1: పింఛన్ల పెంపు చరిత్రాత్మకమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ అన్నారు. పెంచిన పింఛను నగదును సోమవారం ఆమె చేతుల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సోమవారం ఉదయం 5గంటల నుంచే బొజ్జల బృందమ్మ టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేశారు. ముందుగా తొట్టంబేడు మండలం పూడి గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు ఆధ్వర్యంలో పింఛను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బృందమ్మ రూ.3వేల నుంచి రూ.4వేలకు పెరిగిన పింఛనుతో పాటు మూడు నెలల నగదు కలిపి రూ.7వేలుగా అంద జేశారు. అలాగే శ్రీకాళహస్తి పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద టీడీపీ పట్టణా ధ్యక్షుడు విజయకుమార్, పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్ ఆధ్వర్యంలో బృందమ్మ పింఛన్లు పంపిణీ చేశారు. తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని 9వ వార్డు పరిధిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత పింఛన్ల పెంపును హర్షిస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధిలో టీడీపీ నాయకులు కాసరం రమేష్, 26, 27వ వార్డు పరిధిలో పురపాలక సంఘం మాజీ చైర్మన్ ముత్యాల పార్థసారథి, తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయచంద్ర నాయుడు, శ్రీకాళహస్తి మండలంలోని మన్నవరం వద్ద మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్య నాయుడు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు అందజేశారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంపేడులో మాజీ ఎంపీపీ తాటిపర్తి ఈశ్వరరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు.

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట, మర్రిమంద, వికృతమాల, గోవిందవరం, మడిబాక, పల్లం, పల్లంపేట, ఏర్పేడు పంచాయతీల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి లబ్ధిదారులకు పింఛను అందజేశారు. గోవిందవరంలో చంద్రబాబు చిత్రపటానికి రిషితారెడ్డి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా మేర్లపాక పంచాయతీలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి నగరం వినుత పింఛను అందజేశారు. అలాగే మన్నసముద్రం, కొబాక గ్రామాల్లో ఎంపీడీవో గిడ్డయ్య, జడ్పీటీసీ తిరుమలయ్య లబ్ధిదారులకు పింఛను అందజేశారు. అంజిమేడులో ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్ కందాటి శివశంకర్‌రెడ్డి, కన్నలి మోహన్‌రెడ్డి, గోవిందవరం పంచాయతీ జింకలమిట్ట ఎస్టీకాలనీలో మాజీ జడ్పీటీసీ పేరం ధనంజయులు నాయుడు పింఛన్లు అందించారు.

రేణిగుంట: మండలంలోని వేణుగోపాలపురం, తారకరామనగర్, కరకంబాడి, వెంకటాపురం, జీపాళెం గ్రామాల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిచంద్రారెడ్డి, మహబూబ్‌బాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, పుష్పనాథస్, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



రేణిగుంట మండలం వేణుగోపాలపురంలో ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి, ఏర్పేడు మండలం మేర్లపాక జనసేన ఇన్‌ఛార్జి వినుత పింఛన్ల పంపిణీ

మాట ఇచ్చాం... అమలు చేశాం: ఆదిమూలం


నారాయణవనం పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జూన్ 1: ఎన్నికల హామీలు ఇచ్చి మరచిపోవడం టీడీపీకి తెలియదని, ఇచ్చిన మాట ప్రకారం అవ్వతాతలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచిన పింఛనుతో పాటు మూడు నెలలతో బకాయిలు రూ.3 వేలు కలిపి లబ్ధిదారులకు అందజేశామని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. నారాయణవనంలో సోమవారం ఉదయం 6గంటల నుంచే పింఛన్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏకాంబరం, భాస్కరన్, గోవిందస్వామి, భక్తవత్సలం, ఊరప్ప, గోవిందశెట్టి, శివ, దయా, కేఎస్ రవి, సుబ్రహ్మణ్యం, నాగ రాజు, హరి, వేలురెడ్డి, షణ్ముగం, విజయ్‌కుమార్, జయచంద్ర నాయుడు, నరేష్, మునిబాబు, పయణి, దాముర్రెడ్డి, శంకర్, తిరువెంకడం, శివకుమార్, శరవణ, పురుషోత్తం, ఆలీబాయ్, శేఖర్, బంగారి, దొరవేలు, సుధాబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: మండలంలోని మదనంబేడులో ఎమ్మెల్యే ఆదిమూలం పింఛన్లు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు, ఎన్టీఆర్, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, సర్పంచు శివరంజని, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్, జనసేన మండల అధ్యక్షుడు రూపేష్‌కుమార్, మాజీ ఎంపీపీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. పీవీపురంలో టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి మాచర్ల రోశయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛనుతో పాటు జామ మొక్కలను పంపిణీ చేశారు.

పిచ్చాటూరు: మండల కేంద్రమైన పిచ్చాటూరులో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పింఛన్లు పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు పద్దురాజు, బుజ్జినాయుడు, రవి, వాసురెడ్డి, తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్, ఇన్‌చార్జి ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

నాగలాపురం: నాగలాపురం మండలంలోని మిరపతోటలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, పార్థిబన్, విజయకుమార్, పరశురాం శిల్పి, నమశ్శివాయం, రాంప్రకాష్ యాదవ్, చాన్‌భాషా, మురళి, సునీల్, ఎండీ కుమార్, జాన్సన్, అన్బు, డాక్టర్ శేషాద్రి, నెల్సన్ మండేలా, భాస్కర్ బాబు, తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో బాబు, వీఆర్వో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని రాజులకండ్రిగలో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గోపీనాథరెడ్డి, మునస్వామియాదవ్, సర్పంచులు దొరబాబునాయుడు, బాలాజీ, సురేష్, వెంకటేష్, ప్రకాష్‌తో పాటు జనసేన నాయకుడు కన్నయ్య, బీజేపీ నేత మునిశేఖర్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని పులివెల్లం, వరదయ్యపాలెం, చిన్నపాండూరు, రాచెర్ల, కదూరు గ్రామాల్లో టీడీపీ నాయకులు, సచివాలయ అధికారులు పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఆనంద్, సిద్ధయ్య, జనసేన నాయకులు తడ శ్రీనివాసులు, సచివాలయ అధికారులు శేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: పెన్షన్ల పెంపుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాభిషేకం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కన్నయ్య నాయుడు, సముద్రాల సుధాకర్ నాయుడు, మెనెయ్య నాయుడు, వెంకటచలం, రవి నాయుడు, రమేష్‌బాబు, మునిరాజా, శ్రీనివాసులు, మునిబాబు, నాగేశ్వరరావు, శేషయ్య, గోపి, రామనాథం తదితరులు పాల్గొన్నారు.


కేవీబీపురం బీసీ కాలనీలో పింఛన్ల డబ్బు చూపిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్న వృద్ధులు, వితంతువులు


నాగలాపురం మండలంలోని టీపీ కోట గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించి తమ కృతజ్ఞతను చాటుతున్న పింఛను లబ్దిదారులు

పల్లం విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం


ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఆనంద్

ఏర్పేడు, జూలై 1: ఏర్పేడు మండలం పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలకు మారుమూల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సును మంజూరు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తెలిపారు. సోమవారం టీడీపీ నాయకుడు చంద్ర శేఖర్ నాయుడుతో కలిసి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పల్లం పాఠశాలకు సుమారు 40 గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారని, ఇందులో 32 గ్రామాల వారికి బస్సు సౌకర్యం లేకపో వడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొంతమంది పాఠశాలలకు హాజరు కావడం లేదన్నారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డీపో మేనేజరు చెంగల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంకటగిరి డిపో మేనేజరు రామకృష్ణతో మాట్లాడి బస్సును ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేవీ బాబు, రెడ్డెప్ప, వెంకటరామయ్య, రామసుబ్బమ్మ, పుష్పవాణి, వాణి, సురేష్, సోమశేఖర్‌రాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఘనంగా వైద్యుల దినోత్సవం




పుత్తూరు, జూలై 1: పుత్తూరులోని సుభాషిణి ఆస్పత్రి, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవం నిర్వహించారు. వాకర్స్ ఎలెక్ట్ గవర్నర్ మాధవనాయుడు ఆధ్వర్యంలో విశ్రాంత డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వాకర్స్ సభ్యులు రామచంద్రనాయుడు, సుబ్రమణ్యంనాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎల్ఎన్ మూర్తి, మునికృష్ణయ్య, కుప్పయ్యశెట్టి, నరసింహారావు, యుగంధర్ రాజు, పాండురంగయ్య, టీడీపీ నాయకులు జీవరత్నంనాయుడు, ఎస్ఎస్ ధనపాల్, జయరాంనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

పుత్తూరు అర్బన్, జూలై 1: మండల పరిధిలోని గోపాలకృష్ణాపురానికి చెందిన టీడీపీ కార్యకర్త బాబు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. నాయకులు పాండురంగయ్య, బాలాజీనాయుడు, ధనపాల్, శేఖర్‌రెడ్డి, విజయ్‌చౌదరి, చంద్రాయాదవ్ తదితరులు నివాళులర్పించారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు: ఎమ్మెల్యే భాను



గేటు పుత్తూరులో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ - వడమాలపేట మండలం పూడిలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర

పుత్తూరు అర్బన్, జూలై 1: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు సీఎం చంద్రబాబునాయుడు పింఛన్లను పెంచి మాట నిల బెట్టుకున్నారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని గేటు పుత్తూరు 7,8వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం చంద్రబాబు పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇవ్వడమే కాకుండా ఏప్రిల్ నెల నుంచే పెంచిన పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు అందిస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పింఛన్ల పెంపు ఫైలుపై తొలి సంతకం చేసి రాష్ట్ర ప్రజల పట్ల తనకున్న విశ్వాసాన్ని చంద్రబాబు నిలుపుకున్నారని స్పష్టం చేశారు.

వడమాలపేట: మండలంలోని చింతకాల్వలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే టీసీ అగ్రహారంలో ఇంటింటా పింఛన్లు అందజేశారు. టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, మురళీధర్ రెడ్డి, మునిరత్నం, రవినాయుడు, సురేష్, రమేష్, లక్ష్మీప్రసన్న, రవిరెడ్డి, దాము, ఉమాపతి రావ్, బాలాజీ, గోపి అధికారులు పాల్గొన్నారు. కాగా, పూడి గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర పరిశీలించారు. అర్హులందరికీ పింఛను అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.